క్లుప్తంగా

సత్యదేవుని ఆలయంలో ప్రత్యేక పూజలు నేడు



రమాసహిత సత్యనారాయణస్వామి

దాబాగార్డెన్స్: అధిక శ్రావణ శుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని ఇసుకకొండపై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బుద్ద మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. భక్తులు సామూహిక వ్రతంలో పాల్గొనాలని, సత్యదేవుడిని దర్శించుకుని ఆశీస్సులు పొందాలని కోరారు. విశేష పౌర్ణమి సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టినట్టు తెలిపారు. భక్తులు ప్రదక్షిణ చేసేందుకు, విశేష వ్రతాచరణకు ఆలయ ప్రధాన అర్చకుడు పి.నరసింహాచార్యులు నేతృత్వంలో అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలియజేశారు.

పథకం కొనసాగింపునకు వినతి

మహారాణిపేట: బెస్ట్ అవైలబుల్ పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేస్తూ దళిత హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. సంఘం అధ్యక్షుడు చింతాడ జోగారావు మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ఎంతో మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.


బీఎస్ఎన్ఎల్ పెన్షనర్ల నిరసన



నిరసన తెలుపుతున్న పెన్షనర్లు

దాబాగార్డెన్స్: తమ డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ దాబాగార్డెన్స్‌లోని జనరల్ మేనేజర్ కార్యాలయం వద్ద పెన్షనర్లు సోమవారం నిరసన ప్రదర్శన చేపట్టారు. బీఎస్ఎన్ఎల్, ఎంటీఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఐబీడీపీఏ జిల్లా కార్యదర్శి కె.రామాంజనేయులు, ఎస్ఎన్పీడబ్ల్యూఏ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్ వరప్రసాద్ మాట్లాడారు. 2017 జనవరి ఒకటి నుంచి పెన్షన్ రివిజన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వరప్రసాద్, జగదీష్, చిట్టిబాబు, ఆర్.గోవిందరాజులు, అధిక సంఖ్యలో పెన్షనర్లు పాల్గొన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన సదస్సు



ప్రసంగిస్తున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి శేషమ్మ

విశాఖ లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సోమవారం న్యాయసేవ సదన్‌లో హ్యూమన్ ట్రాఫికింగ్, దుష్ప్రభావాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ ప్రసంగించారు. మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేపట్టాల్సిన చర్యల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, మహిళా సాధికార అధికారి బి.వెంకటేశ్వరి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్య పద్మ, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.మోహన్ లక్ష్మి, సభ్యులు డాక్టర్ బాబీ, ఎం.జేసుదాసు, ప్యానల్ లాయర్లు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

'ఉక్కు' ప్రైవేటీకరణకు నిరసనగా పాదయాత్ర

మహారాణిపేట: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు నిరసనగా టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు సక్కా లక్ష్మణరావు పాదయాత్ర నిర్వహించారు. ఈ పాదయాత్ర ముగింపు సందర్భంగా జేసీ విశ్వనాథన్‌కు వినతిపత్రం సమర్పించారు.

అప్రమత్తతతో వ్యాధులకు చెక్

• జోన్-4 ఏఎంహెచ్‌వో సత్యనారాయణ



జగదాంబ: వర్షాకాలం ప్రారంభం కావడంతో వ్యాధుల ముప్పు పొంచి ఉంది. డెంగ్యూ, మలేరియా జ్వరాలు వ్యాప్తి చెందే అవకాశం ఉండటంతో జీవీ ఎంసీ అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రత్యేక వైద్యబృందాలు యాంటీ లార్వల్ ఆపరేషన్లు, అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధులకు చెక్ పెట్టేందుకు తీసుకుంటున్న చర్యలను జోన్-4 అడిషనల్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ సత్యనారాయణ వివరిస్తున్నారు.

సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా చేపడుతున్న చర్యలు

ముందుగా వార్డుల్లో మురుగు కాలువలు, గెడ్డలు శుభ్రం చేయిస్తున్నాం. ఎక్కడైనా నీటి ప్రవాహంలో అడ్డంకులుంటే పారిశుధ్య కార్మికులతో శుభ్రం చేయించి, నీరు ఆగకుండా చర్యలు తీసుకుంటున్నాం. దీనివల్ల దోమలు వృద్ధి చెందకుండా ఉంటాయి. వ్యాధుల తీవ్రత తగ్గుతుంది.

వ్యాధుల నివారణకు అవగాహన కార్యక్రమాలు

వ్యాధులు వ్యాప్తి చెందకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ ఆదేశాల మేరకు ఇప్పటికే వార్డుల్లో ఆటోల ద్వారా, వీధి నాటకాల ద్వారా ప్రచారం చేయిస్తున్నాం. మలేరియా సిబ్బందితో ఇంటింటికీ వెళ్లి నిల్వ నీరు, టైర్లు, మనీప్లాంట్‌లు, అరటిపండ్ల తొక్కలు, తాగి వదిలేసిన కొబ్బరిబొండాలు వంటివి పరిసరాల్లో ఉండకూడదని తెలియజేస్తున్నాం.

వార్డుల్లో యాంటీలార్వల్ ఆపరేషన్లు

ఎక్కడైతే నీటి నిల్వలు ఉన్నాయో అక్కడ యాంటీ లార్వల్ ఆపరేషన్ చేపట్టి చేసి దోమలు వృద్ధి చెందకుండా చూస్తున్నాం. ముఖ్యంగా ఇంట్లో ఫ్రిజ్ వెనుక భాగంలో నీరు నిల్వ ఉంటుంది. అలాగే వాడుకునే నీటి డ్రమ్ముల్లో కూడా దోమలు వృద్ధి చెందే అవకాశం ఉంది. కాబట్టి వాటిలో కూడా యాంటీ లార్వల్ అపరేషన్లు చేయిస్తాం. ఇందుకోసం ప్రత్యేకంగా మలేరియా సిబ్బంది బృందాలుగా ఏర్పడి వార్డుల్లో ప్రతీ ఇంటికి వెళ్లి ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

జోన్-4లో తీసుకుంటున్న చర్యలు

మెడికల్ సిబ్బందితో ప్రతి రోజు వార్డు పర్యటనలు చేస్తున్నాం. వార్డుల్లో ఏఎన్ఎంలు వైద్యపరీక్షలు చేయిస్తారు. ఎవరికైనా జ్వరం వచ్చే సూచనలు ఉంటే వారు ఇచ్చిన సమాచారం మేరకు వెంటనే సమీపంలోఉన్న ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రానికి తీసకువెళ్లి ఆరోగ్య పరీక్షలు చేయించి, మందులు ఇప్పిస్తున్నారు.

జ్వరం వస్తే అశ్రద్ధ చేయొద్దు

ఎవరైనా జ్వరం వస్తే అశ్రద్ధ చేయవద్దు. సమీపంలో ఉన్న ఏఎన్ఎంల వద్దకు, ఆస్పత్రులకు వెళ్లాలి. మందులు క్రమం తప్పకుండా వేసుకోవాలి. డెంగ్యూ జ్వరం అయితే ప్లేట్‌లెట్స్ తగ్గకుండా ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలి. పండ్లు, ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి. ఫ్రిజ్‌లో ఉండే పదార్థాలు తీసుకోకూడదు. జోన్ పరిధిలోని మా సిబ్బంది దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్నారు. ఎక్కడైనా సమయానికి ఫాగింగ్ చేయకపోతే జోనల్ కార్యాలయంలో గానీ, మలేరియా సిబ్బందికి గానీ తెలియజేయాలి. వెంటనే ఫాగింగ్ జరిగేలా చూడాలి. దోమల వ్యాప్తిని అడ్డుకోవాలి.

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

సీతమ్మధార: మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి మాట్లాడుతూ 20 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులను ప్రభుత్వ కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు ఇవ్వాలని కోరారు. ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలన్నారు. కార్యక్రమంలో జి.మంగశ్రీ, రాము, భవానీ, అప్పలనర్సమ్మ, పి.మణి, ఆర్‌కేఎస్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ పాఠశాల పరిశీలన



ఉర్దూ స్కూల్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్ సాధిక్

జగదాంబ: బాలికల ఉర్దూ స్కూల్ మరమ్మతులు చేపడతామని 39వ వార్డు కార్పొరేటర్ ముహమ్మద్ సాధిక్ అన్నారు. వార్డు పరిధి అంబుసారంగి వీధిలో ఉన్న బాలికల ఉర్దూ పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. స్కూల్‌ను ఆనుకుని భారీ వృక్షం పెరిగిపోవడంతో భవనం కూలిపోయే పరిస్థితి నెలకొంది. అలాగే స్కూల్ పైకి వెళ్లే మెట్లు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పాఠశాల నిర్వాహకులు కార్పొరేటర్ సాధిక్‌కు తెలపడంతో ఆయన పరిశీలించి, జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేశారు. అధికారులు భవనాన్ని పరిశీలించి, కమిషనర్‌కు నివేదిక పంపిస్తామన్నారు. సాధిక్ మాట్లాడుతూ పాఠశాల మరమ్మతులు వెంటనే చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైస్సార్‌సీపీ వార్డు నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే ఉత్తరాంధ్ర అభివృద్ధి



మాట్లాడుతున్న సనపల రవీంద్ర భరత్

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర అభివృద్ధి వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని ఆంధ్రప్రదేశ్ కళింగ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ సనపల రవీంద్రభరత్ పేర్కొన్నారు. తన కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్థిక రాజధాని కాబోతున్న విశాఖ నగరంలో పెట్టుబడుల హవా మునుపెన్నడూ లేని విధంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలోనే సాధ్యపడిందన్నారు. అందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖ నగరానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపును తీసుకు రావడంతో విశాఖలో భారీ పెట్టుబడులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు మనం చూడగలుగుతున్నామని చెప్పారు. ఉత్తరాంధ్రకు మణిహారంగా భావించే అంతర్జాతీయ విమానాశ్రయం త్వరితగతిన పూర్తయ్యేందుకు చూపిస్తున్న చొరవ ముఖ్యమంత్రి దార్శనికతకు నిదర్శనమన్నారు. సుమారు రూ.136 కోట్లతో జీవీఎంసీ ప్రాజెక్టులు, రూ.865 కోట్లతో రహేజా గ్రూప్ ద్వారా ప్రారంభం కాబోతున్న ఇనార్బిట్ మాల్, రూ.44 కోట్లతో బయోటెక్ ఫార్మా ఇంక్యుబేషన్ టెస్టింగ్ ల్యాబ్ వంటి కార్యక్రమాలతో పాటు పర్యాటక రంగంలోనూ సుమారు రూ.350 కోట్లతో ఒబెరాయ్ వంటి దిగ్గజ సంస్థల ద్వారా బీచ్ వద్ద స్టార్ హోటల్స్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు.

బైక్‌పై వెళ్తూ మూర్ఛతో వ్యక్తి మృతి



మృతుడు శ్రీనివాసరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్



మృతుడు ఎల్లంకి శ్రీనివాస్

అక్కిరెడ్డిపాలెం: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధికి గురై మృతి చెందిన ఘటన ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్ద సోమవారం జరిగింది. గాజువాక ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెం ఎన్‌జీవోస్ కాలనీకి చెందిన ఎల్లంకి శ్రీనివాస్ (44) లిఫ్ట్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. సోమవారం శ్రీనివాస్ గాజువాక నుంచి ఆటోనగర్ సిగ్నల్ పాయింట్ వద్దకు వచ్చేసరికి మూర్ఛ రావడంతో హఠాత్తుగా తన వాహనాన్ని నిలిపి పక్కకు ఒరిగిపోయాడు. బీట్ కానిస్టేబుల్ సపర్యలు చేసినా అపస్మారక స్థితిలోకి చేరుకుని మరణించాడు. సమాచారం అందుకున్న గాజువాక పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుని వద్ద ఉన్న ఆధార్ కార్డు ఆధారంగా బంధువులకు సమాచారం అందించి, మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ కొల్లి సతీష్ తెలిపారు. శ్రీనివాస్‌కు భార్య రాజ్యలక్ష్మి, ఒక పాప, బాబు ఉన్నారు. పాప పదో తరగతి, బాబు 8వ తరగతి చదువుతున్నారు.

ఎమ్మెల్యే వాసుపల్లి పరామర్శ

అల్లిపురం: మృతుడు ఎల్లంకి శ్రీనివాస్ జీవీఎంసీ 33వ వార్డు వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు ఎల్లంకి చిన్నమ్ములు పెద్ద కుమారుడు. శ్రీనివాస్ మృతి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ చిన్నమ్ములును పరామర్శించారు. ఆయనతో పాటు పార్టీ నాయకులు బొడ్డేటి ప్రసాద్, పాల శ్రీహరిరెడ్డి, తదితరులు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

17 నుంచి శ్రావణ మాసం పూజలు



సిరులతల్లి కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): ఈ నెల 17 నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు శ్రావణమాసం పూజలు జరగనున్నాయి. కనమహాలక్ష్మి దేవస్థానంలో నెల రోజులూ ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, అలాగే గురు, శుక్రవారాల్లో 2 విడతలుగా ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, 9.30 నుంచి 10.30 గంటల వరకు ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. విశిష్ట సామూహిక కుంకుమ పూజలో పాల్గొనదలిచే భక్తులు(దంపతులు) రూ.400 రుసుం చెల్లించాలి. పూజా సామగ్రిని దేవస్థానమే సమకూర్చుతుంది. పూజ అనంతరం భక్తులకు శేషవస్త్రాలు, మహాప్రసాదం అందజేస్తారు. పూజా రుసుంను అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్: యూబీఐఎన్0806081, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచిలో చెల్లించాలని ఆలయ ఈవో శిరీష, ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. పూర్తి వివరాలకు 0891-2568645, 2566515, 2731250 నంబర్లలో సంప్రదించాలన్నారు. పూజలో పాల్గొనలేని భక్తుల గోత్రనామాలతో పూజ చేసి లక్ష్మీ యంత్రం, కుంకుమ, ప్రసాదం పోస్టల్ ద్వారా ఇంటికి పంపనున్నట్టు ఈవో పేర్కొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: విశాఖవాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. లేదా ఈ మెయిల్ endow-eokanaka@gov. in ద్వారా తెలుసుకోవచ్చు.

'కన్యక' ఆలయంలో శ్రావణమాస పూజలు

దాబాగార్డెన్స్: పాతనగరం కురుపాం మార్కెట్ సమీపాన గల కన్యకాపరమేశ్వరి ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ఈ నెల 17 నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శ్రావణమాసంలో వచ్చే ఐదు శుక్రవారాల్లో అమ్మవారి మూల విరాట్‌కు ప్రాతఃకాలంలో క్షీరాభిషేకం, ప్రత్యేక పూజలు, అమ్మవార్ల స్తోత్ర పారాయణం, మహిళలచే సామూహిక శ్రీచక్ర సహిత కుంకుమ పూజలు నిర్వహించనున్నారు. ఈ నెల 18న మొదటి శుక్రవారం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించనున్నారు.


జీవో నం.108,107 రద్దుకు డిమాండ్

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ సీట్ల ఫీజులు ఖరారు చేస్తూ తీసుకువచ్చిన జీవో నంబర్లు 108,107 రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్.జె.నాయుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ పేద విద్యార్థులను వైద్యవిద్యకు పూర్తిగా దూరం చేసే కుట్ర చేస్తున్నార‌ని ఆరోపించారు. కార్యక్రమంలో హర్షిత, తులసి, దివాకర్, సంతోష్, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

కరువుభత్యం విడుదలకు వినతి

సీతమ్మధార: బకాయి పడిన కరువు భత్యాన్ని వెంటనే విడుదల చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్స్ సర్వీసులను క్రమబద్ధీకరించాలని ఏపీ రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి (ఏపీఎస్‌పీఈజేఏసీ) ప్రతినిధులు బి.నాగేశ్వరరావు, మహేశ్వర రెడ్డి డిమాండ్ చేశారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఉద్యోగులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలిపారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని విద్యుత్ సంస్థలో విలీనం చేయాలని కోరారు. అదనపు పోస్టులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కె.సత్యప్రసాద్, రత్నాలరావు, వి.వి.మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎంసీఏ సౌత్ ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా రొనాల్డ్



బీచ్ రోడ్డు: వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్‌లో విశాఖ వైఎంసీఏకు చెందిన నలుగురికి చోటు లభించింది. వైఎంసీఏ సౌత్‌ఈస్ట్ రీజియన్ చైర్మన్‌గా మరోసారి రొనాల్డ్ విలియమ్స్ ఎంపికయ్యారు. సోమవారం జరిగిన వైఎంసీఏ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో రొనాల్డ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నేషనల్ కౌన్సిల్ వైస్ చైర్‌పర్సన్‌గా డాక్టర్ బెట్సీ విలియమ్స్, ఈసీ సభ్యులుగా డాక్టర్ కృపానంద కుమార్, విజయ్‌ప్రదాన్ ఎన్నికయ్యారు.

శ్రీవారికి వెండి కుందుల బహూకరణ

కొమ్మాది(భీమిలి): రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయానికి సోమవారం సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ రూ.7 లక్షలు విలువ చేసే వెండి కుందులను బహూకరించారు. మంగళవాయిద్యాల నడుమ వెండి కుందులను తీసుకొచ్చి అంతరాలయంలో శ్రీవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో జగన్మోహనాచార్యులు, టీటీడీ వేద పండితులు, అర్చకులు పాల్గొన్నారు.



వెండి కుందులను తీసుకొస్తున్న మావూరి వెంకటరమణ

రోగులకు ఎమ్మెల్యే ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి

దాబాగార్డెన్స్: ప్రజాదర్బార్‌లో వైద్యసహాయం కోరుతూ పలువురు అందించిన వినతులపై స్పందించిన ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ సోమవారం పలువురికి ఆర్థిక సాయం అందజేశారు. 38వ వార్డు బుక్కావీధి భూలోకమ్మ గుడి సమీపంలో నివసిస్తున్న దొలపల్లి ధన గుండె సంబంధిత వ్యాధితో బాధపడడంతో ఎమ్మెల్యే ఆమె ఇంటికి వెళ్లి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. గాంధీబొమ్మ వద్ద కిశోర్ లోహితకు ఫిట్స్ మందుల కోసం రూ.5వేలు, మట్టా వెంకటప్ప వీధికి చెందిన సూరన రాజుకు గుండెకు సంబంధించి వైద్య ఖర్చులకు రూ.5వేలు, పెద్ద కాలువ ప్రాంతానికి చెందిన కురివేల జగన్నాథ్ సాయికిశోర్ కుటుంబానికి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కనకమహాలక్ష్మి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, టౌన్‌కొత్తరోడ్డు జగన్నాథస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మారోజు శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు సంకాభక్తుల సన్యాసిరావు, బెహర వెంకటరత్నం, గోడే నరసింహాచారి, పెదగాడ బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ప్రజా వినతుల పరిష్కారం



అర్జీదారుల సమస్యలు తెలుసుకుంటున్న జోన్-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను జీవీఎంసీ జోన్-5 కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ ఆదేశించారు. జ్ఞానాపురంలోని జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి పలు సమస్యలపై 06 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జెడ్సీ స్వీకరించి పరిశీలించారు. ఆయా విభాగాల అధికారులకు పరిష్కార నిమిత్తం అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 03, రెవెన్యూకు 02, యూసీడీ విభాగానికి 01 చొప్పున వినతులు అందినట్లు జెడ్సీ కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్-1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్-2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆర్వోలు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, వాటర్ వర్క్స్ ఈఈ-2 సూరిశెట్టి శేఖర్, డీఈ శ్రీనివాసవర్మ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ రఘునాథ్, టీపీవో శ్రీలక్ష్మి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, సూపర్‌వైజర్ జనార్దన్, టీపీఆర్‌వో ఏపీడీ చిరంజీవి, సచివాలయ అడ్మిన్లు పాల్గొన్నారు.

అగ్రిగోల్డ్ బాధితుల ఆందోళన



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

మహారాణిపేట: అగ్రి గోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కె.మంగరాజు మాట్లాడుతూ ఆగస్టు 15వ తేదీ లోగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఆగస్టు 30వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి అగ్రిగోల్డ్ బాధితులు విజయవాడలో ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి మధుసూదనరావు, అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నాయకులు పాత్రుడు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.

పురందేశ్వరి వ్యాఖ్యలపై వామపక్షాల నిరసన



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీలు

సీతమ్మధార: విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకంపై ఏది లాభం అయితే అది చేస్తామని ప్లాంట్ అమ్మకపు చర్యలను బలపరిచిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి వ్యాఖ్యలను వామపక్ష పార్టీలు ఖండించాయి. వాల్తేరు డివిజన్‌తో కూడిన రైల్వే జోన్, విభజన హామీలను బీజేపీ ప్రభుత్వం అమలు చేయకుంటే ప్రజా ఉద్యమం చేపడతామని నాయకులు హెచ్చరించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, రైల్వేజోన్, విభజన హామీలు, ప్రభుత్వ భూముల రక్షణ, ఆదానీ గంగవరం పోర్టు కార్మికులకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహాన్ని ఎండగడుతూ సీపీఎం, సీపీఐ, ఎం.సీపీఐయూ తదితర వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు డా.బి. గంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే చర్యలు వెనక్కు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఎస్కే రెహ్మాన్, ఎ.విమల, కె.కుమారి, పి.చంద్రశేఖర్, యుఎస్ఎన్‌రాజు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అడవుల సంరక్షణలో రేంజర్ల కృషి ఎనలేనిది



ప్రదర్శనలో విద్యార్థులు అధ్యాపకులు

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో 'వరల్డ్ రేంజర్స్ డే' క్యాంపింగ్ థీమ్ ఎగ్జిబిషన్ ను సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ ప్రారంభించారు. అడవిని, జీవవైవిధ్యాన్ని కాపాడేందుకు తమ జీవితాలను అర్పించిన ఫారెస్ట్ రేంజర్లకు నివాళులు అర్పించేందుకు ప్రతి ఏడాది జూలై 31న ప్రపంచ రేంజర్ల దినోత్సవాన్ని పాటించాలని కోరారు. రేంజర్ లీడర్ డాక్టర్ పి.మేరీ అనుపమ నేతృత్వంలో పలువురు విద్యార్థులు ప్రదర్శనలో పలు మోడల్స్‌ను ప్రదర్శించారు. డాక్టర్ కె.ఎం కుమారి, డాక్టర్ పద్మ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పర్యావరణ అనుకూల ప్రదర్శనలకు ఇలాంటి ప్రయోగాలు ఎంతో ఉపయోగపడాయని ప్రిన్సిపాల్ డాక్టర్ షైజీ అన్నారు. కార్యక్రమంలో సిస్టర్ హేమ, డాక్టర్ సుధ, డాక్టర్ పి.కె.జయలక్ష్మి, డాక్టర్ మౌసామి, పలువురు విద్యార్థినులు పాల్గొన్నారు.

'స్టార్ ఆంధ్రప్రదేశ్' విజేత శైలజ



స్టార్ ఎపి పోటీల్లో శైలజకు కిరీటం

మహారాణిపేట: వివిధ రంగాల్లో ప్రతిభా కౌసల్యం ప్రదర్శించిన విశాఖపట్నానికి చెందిన పీసుపటి శైలజ అందాల శ్రీమతిగా ప్రథమ స్థానంలో నిలిచింది. నగరంలో ఓ హోటల్‌లో సోమవారం స్టార్ ఆంధ్రప్రదేశ్ పోటీలు ఆసక్తికరంగా సాగాయి. విజ్ఞానం, వికాసం, కౌసల్యం, మాట చాతుర్యం, వినోదం, అందం, భాషపై పట్టు తదితర అంశాల్లో జడ్జిలు అడిగిన అన్ని ప్రశ్నలకు శైలజ చక్కగా సమాధానం చెప్పడంతో ఆమెను విజేతగా ప్రకటించారు. 20 మంది వివాహితలు ఈ పోటీల్లో పాల్గొనగా.. శైలజ అందాల శ్రీమతి కిరీటాన్ని దక్కించుకున్నారు. బుల్లయ్య కళాశాలలో డిగ్రీ పూర్తి చేసిన శైలజ గతేడాది జరిగిన శ్రీమతి వైజాగ్ పోటీల్లో హ్యుమానిటేరియన్ అవార్డును దక్కించుకున్నారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథులుగా మిస్‌ఇండియా సంతోషిని, మిస్టర్ ఒలింపియా అరుణ్ పాల్, బిగ్‌బాస్ ఫేమ్ అనీల్ రాథోడ్ హాజర య్యారు. స్టార్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపకులు నందిని గొల్లూరి, రోహిత్ సువ్వాడ ఈ పోటీలు నిర్వహించారు.

బోటు షికారు నిలిపివేత

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో బోటుషికారును ప్రస్తుతం నిలిపివేసినట్లు నిర్వాహకులు తెలిపారు. సముద్రంలో అలల ఉధృతి తీవ్ర స్థాయిలో ఉండటంతో బోటుషికారు నిలిపివేస్తున్నామని, వాతావరణం అనుకూలించిన తరువాత కొనసాగిస్తామని పేర్కొన్నారు.